


# మరలూ - మనుషులూ

**గో**ధూళి వేళ.

నీరెండలో ఫ్యాక్టరీ హుందాగా నిలబడి వుంది.

లోపల మనుషులు మరల్లా పనిచేసుకుపోతున్నారు.

అటూ యిటూ వూగుతూ మిషన్ షాఫ్టు, మనిషి చెప్పినట్టూ పొగాకు బోళ్ళను ఎడదీస్తుంది. అటూ యిటూ వూగుతున్న బైట పిచ్చి మొక్క మనిషి ఉనికిని ప్రశ్నిస్తోంది.

"అరె యల్ల మందా - ఆ యీ నెలు పక్కకు తోయ్యరా - అరె అలానట్రా తోసేది? ఇంకెప్పుడు నేర్చుకొంటావురా నువ్వు పని, మాట్లాడుతూ కూసోటం తప్ప....'దగ్గుతూ సర్వసతి మిగతా మాటల్ని మింగేసింది.

మిషన్ మోతలో దగ్గు కలిసిపోయింది.

గోడౌనంతా పొగాకు వాసన దట్టంగా పేరుకొని వుంది. దగ్గు మధ్యలో ఊపిరి పీల్చినప్పుడల్లా ఘాటైన వాసన ఊపిరితిత్తుల్లోకి వెళ్ళి మళ్ళీ దగ్గొస్తూంది.

ఆ రోజు చినబాబు వస్తున్నాడు స్టేట్స్ నుంచి!

నాలుగు సంవత్సరాల తర్వాత వస్తూన్న కొడుకుని రిసీవ్ చేసుకోవటానికి పెదబాబూ, ఆయన భార్య ఢిల్లీ వెళ్ళేరు. అంతదూరం వెళ్ళలేరు కాబట్టి మానేజరూ, అకౌంటెంటూ స్టేషన్‌కి వెళ్ళేరు. అక్కడికీ వెళ్ళలేని కూలీలు ఆత్రంగా ఫ్యాక్టరీలోనే వాళ్ళ రాకకోసం ఎదురు చూస్తున్నారు.

మిషను చప్పుళ్ళూ - సరస్వతి మాటలూ తప్ప అంతా మౌనంగానే వుంది.

యంత్రాలూ... యాత్రికంగా పనిచేస్తూ మనుషులూ.... మధ్య సరస్వతి హడావుడి....

"ఏందే సరస్వతి- నువ్వే ఫోర్ మన్లాగ అరుస్తావు" అన్నది చినతల్లి.

"దాని సంగతి నీకు తెల్దేటి."

సరస్వతి ఈ మాటలకి నవ్వింది పది హేనుసంవత్సరాలనుంచీ అక్కడ పనిచేస్తున్న అనుభవం... ఊహ తెల్సినప్పట్నుంచి పెంచుకొన్న అభిమానం- కలగలిపిన నవ్వు.

దాని కళ్ళ ముందు కూలీలు మారేరు. మానేజర్లు మారేరు. మారందాల్లా అదీ దాని యజమాన్లూ, వాళ్ళ మిషన్లూ - ఈ మూడే.

అక్కడ కూలీలు కూడా దేనికన్నా భయపడ్తారూ అంటే ఆ మూడిటికే. దాని నోటికి - యజమానులకి - చెప్పకుండా ఆగిపోయే మిషన్లకి అదృష్టవశాత్తు మిషన్లింత వరకూ ఆగలేదు. జర్మనీ నుంచి తెప్పించిన వాయె. యజమాన్లూ మంచివాళ్ళే. పెదబాబుగారి హృదయం నవనీతం. చినబాబు సంగతి అందరికి తెల్సిందే, విదేశాల్లో ఇంజనీరింగు చదువుకొని వస్తున్న యజమాని. ఇక మిగిలింది సరస్వతి నోరు. అప్పుడుప్పుడూ దాంట్లోంచి దగ్గు వస్తూవుంటుంది. ఎవరన్నా పని చెయ్యకపోతే తిట్లువస్తూ ఉంటాయి. మరి పొగాకు బెళ్ళ మధ్య పనిచేస్తే దగ్గు రాకుండా వుంటుందా? ఇక తిట్ల సంగతి- ఇన్ని సంవత్సరాల్నుంచీ పనిచేస్తున్న దానికి ఆ అధికారం దానంతట అది రాదూ - అయితే మనిషి మంచిదవటంవల్లా - మనసు మంచిదవటం వల్ల, దాని అధికారాన్నీ, నోటి దురుసునీ ఏకగ్రీవంగా అందరూ వప్పుకొన్నారు.

సరస్వతి తాలూకు ఇంకో విశేషం ఏమిటంటే - ఇరవై రెండు లక్షలు పెట్టి జర్మనీ నుంచి తెప్పించిన మిషను ఫ్యాక్టరీలో స్థాపించిన రోజే అది పుట్టింది. ఆ మిషన్‌కి "సరస్వతి' ' అని పేరు పెట్టేరు పెద బాబు.

అది జరిగేక ఓ రెండు సంవత్సరాలకి ఆయన కారు దిగుతూంటే మెట్లప్క ఆడుకొంటూ కనిపించిన పాపని చూసి "ఎవర్రా యిది" అని అడిగేడు.

"మన జోగులు గాడి కూతురండీ. సరస్వతి" అన్నా రెవరో.

జోగులు ఆ ఫ్యాక్టరీలోనే కూలీ.

ఆ పేరు ఆయనలో సహజంగానే కుతూహలాన్ని రేపింది. "సరస్వతా!" అన్నాడు.

"అవునయ్యా! మన కొత్త మిషనొచ్చిన రోజే ఇదీ పుట్టిందండీ మీరు ఆ పేరు పెట్టడం చూసి వాడూ అదే పెట్టిండండీ."

ఆ రోజుల్లో ఎక్కువ మంది పెర్మనెంటు కూలీ లుండేవారు కాదు. సీజన్లో వచ్చే వాళ్ళే తప్ప. అందుకే ఆయనకి ఆ విషయం బాగా గుర్తుండి పోయింది.

అలా గుర్తుండిపోబట్టే, ఆ తరువాత కొంత కాలానికి దాని తండ్రి చచ్చిపోతే జాలితో, అభిమానంతో - తొమ్మిదేళ్ళ వయసయినా, పనిచ్చి, ఆ కుటుంబానికి ఓ ఆధారం చూపించేరు.

..... ..... .......

బయట కారాగిని చప్పుడయింది.

సరస్వతి బయటకొచ్చింది. అలా రాగలిగింది అదొక్కతే.

కారులోంచి చినబాబు, మానేజరూ దిగేరు. నాలుగు సంవత్సరాలు విదేశాల నీరు వంటిని బాగా తెల్ల బడేటట్టు చేసింది కొంచెం వళ్ళు కూఢా వచ్చింది.

"ఏమే బాగున్నావా?" అడిగేడు.

సరస్వతి అదోలా తలెగరేసి, "ఓ" అంది.

మానేజరు నవ్వి "కూలీ లందర్నీ అదరర గొడుతుంది బాబూ పన్జేయ్యటం లేదని" అన్నాడు.

చినబాబు మెట్లెక్కుతూ, "మరి మా మానేజర్లు చెయ్యవలసిన పని సరిగ్గా చెయ్యకపోతే అదే మానేజ్ చేస్తూందన్న మాట. అంతేగా?" అన్నాడు.

మానేజర్ మొహం నల్లగా పెనంలా మాడిపోయింది. సరస్వతి కొంచెం గర్వంగా సిగ్గు పడింది.

అందరూ లోపలికి ప్రవేశించారు.

వర్కర్లు అందరూ ఎక్కడలేని ఏకాగ్రతను తెచ్చిపెట్టుకొని పని చేస్తున్నారు.

చినబాబు ముందుకు సాగి - ఒకచోట ఆగేడు.

నల్లటి పాలిష్‌లో తళతళా మెరుస్తోంది ప్రెస్సింగ్ మిషన్. ఎత్తుగా, హుందాగా, ఠీవిగా నిలబడి వుంది. ఇరవై రెండు లక్షల విలువ వున్న మిషను.

దానే చూస్తూ నిముషం పాటు నిలబడ్డాడు. విదేశాల్లో అతడు చదువుకున్న ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో దాన్ని పరిశీలించేడు. ఇదరవై నాలుగేళ్ళ నుంచీ పని చేస్తూన్నా అరిగిపోని దాని మరల్నీ సంతృప్తితో, ఆప్యాయతతో చూసి, ముందుకు కదిలేడు.

ఫ్యాక్టరీ అంతా అతడు పరిశీలించే టప్పటికి దాదాపు ముప్పావు గంట పట్టింది. ఈ మధ్యలోనే అయిదున్నర గంట వినిపించింది. బిలబిల మంటూ కూలీలు పుట్టలోంచి బయడపడ్డ చీమల్లా ఫ్యాక్టరీని ఖాళీ చేసేరు.

చూడాల్సింది మిషన్లనే కాబట్టి చినబాబు యింకొంచెం సేపు వుండి, మిగతా ఫ్యాక్టరీని కూడా చూసి, మానేజర్‌తో కారెక్కి వెళ్ళిపోయడు.

ఎఱ్ఱటి దుమ్ము మొహం మీదకు కొట్టగానే దగ్గొచ్చింది సరస్వతికి. దగ్గు వూపిరి సలుపుకోనివ్వకుండా ప్రేవులు నలిపేస్తున్నట్టు దగ్గు, నిముషానిగ్గాని తగ్గలేదు.

తగ్గింతర్వాత లోపలికొచ్చింది.

ఎత్తయిన ఫ్యాక్టరీ గోడల మధ్య మందంగా పొగాకు వాసన.

పొగాకు బేళ్ళ మధ్య దట్టంగా వ్యాపించిన నిశ్శబ్దం.

కూలీలు వెళ్ళిపోయిన తర్వాత ఫ్యాక్టరీ, సైనికులు శిథిలం చేసిన కోటలా వుంది. నిర్దాక్షిణ్యంగా కూలీలని కాల్చేసిన ఫిరంగుల్లా వున్నాయి మిషన్లు.

తన టిఫిన్ క్యారియర్ తీసుకోవటానికని వంగిన సరస్వతి నిశ్చేష్టంగా అలానే నిలబడిపోయింది.

ఎప్పట్నుంచి లీక్ అవుతుందో తెలీదు గానీ, ఆ పెద్ద మిషన్ నుంచి, ఆయిల్ అంతా కారి క్రింది మడుగులా తయారయ్యింది.

*　　　*　　　*

ఫ్యాక్టరీ పని మూతపడింది.

ఆకుల్ని గ్రేడ్ ప్రకారం విడదీసేవాళ్ళూ, అలాటివే ఇంకో రెండు మూడు చిల్లర పనులు చేసేవాళ్ళూ మాత్రం వస్తున్నారు. కానీ ముఖ్య మయింది ఆ మిషనే కాబట్టి, చాలావరకు పని ఆగిపోయింది.

బేళ్ళన్నీ లెక్క కట్టి ఒక మూల పేరుస్తూందే కానీ సరస్వతి మాటి మాటికీ ఆ మిషన్నే చూస్తూంది.

పట్నం నుంచి వచ్చిన యిద్దరు ఇంజనీర్లు దాన్ని పరీక్షించి, ఆ పని యిక్కడి వాళ్ళవల్ల అవదనీ, జర్మనీ నుంచి రావాల్సిందేననీ చెబుతున్నారు. చినబాబు ఏదో అంటున్నాడు. వాళ్ళు లాభం లేదన్నట్టు తలూపుతున్నారు. పెద్దయజమయాని మాత్రం ఏమీ మాట్లాడకుండా వాళ్ళు చెప్పేది వింటున్నాడు. పదిహేను సంవత్సరాలు నమ్మకంగా పని చేసిన మిషను, ఒక్క సారిగా ట్రబులిచ్చే సరికి ఆయన మొహంలో దిగులు కొట్టొచ్చినట్టు కనబడింది.

పట్నం నుంచి వచ్చిన ఇంజనీర్లూ, తండ్రీ కొడుకులూ తమని దాటి వెళ్తూ మాట్లాడుకొంటున్నారు.

“చిన్న ట్రబులేమో అనుకున్నాను” అన్నాడు బాబు.

“ఫ్యూయిల్ అంతా కారిపోయి లోపల కాయిల్ కాలిపోయింది సార్. సాఫిస్టికేటెడ్ కాంపొనెంట్. ఆ టెక్నాలజీ తెలిస్తే కానీ లాభం లేదు.”

వాళ్ళు సాగిపోయిరు.

సరస్వతి మిషన్ దగ్గిర కెళ్ళింది.

వర్కర్లు లేకపోవటం వల్ల అంతా ఖాళీగా వుంది.

నెమ్మదిగా చెయ్యి చాచి ఆప్యాయంగా దాన్ని స్పృశించింది. ఏదో మాటల్లో చెప్పలేని భావం - మనసంతా కలచి వేసినట్టు బాధ.

పదిహేనేళ్ళు నిర్విరామంగా పని చేసిన మిషను పాడవదని కాదు, కానీ అప్పటి వరకూ ఎంతో ఉత్సాహంగా చురుగ్గా తిరిగిన మరలు జీవం కోల్పోయి నిస్తేజంగా పడి వుంటే యేదో ఆర్ద్రత - అంతే. అందులోనూ ఆమెకి ప్రతి మరా తెలుసు. ఏవి యెలా కదులుతాయో తెలుసు. అవన్నీ ఇప్పుడు తనవైపు జాలిగా చూస్తున్న అనుభూతి....

... ....

ఇంటికొచ్చి పడుకొన్నదన్న మాటే గానీ, సరస్వతికి నిద్ర పట్ట లేదు. ఆ ఆలోచనలోనే తెల్లవారింది.

ఆమె తిరిగి ఫాక్టరీకొచ్చిన కొంచెం సేపటికి, క్రితం రోజు తాలూకు వర్కర్లూ, చినబాబూ మళ్ళీ వచ్చేరు. టూల్ కిట్‌లోంచి సామానులు తీసి మెయిన్ బాడీ విప్పేరు.

సరస్వతి చూస్తూ నిలబడింది.

లోపల ఎన్నో మరలూ, వైర్లూ - మనిషి శరీరంలో ధమనులూ, సిరల్లా.

నల్లటి గ్రీజు - చెడిపోయిన రక్తంలా.

చినబాబూ వాళ్ళూ ఏదో ఇంగ్లీషులో చర్చించుకొంటున్నారు. అంతలో పెద్దయజమాని కూడా వచ్చేడు. వారేం మాట్లాడుకుంటున్నారో సరస్వతికి అర్థం కాలేదు. చివరలో చినబాబు "ప్రయత్నిస్తాను" అన్న మాట మాత్రం అర్థమయింది.

ఆ రోజు నుంచీ రెండ్రోజులపాటు పట్నం నుంచి వచ్చిన యిద్దరు వర్కర్లతో కలిసి చినబాబు మిషన్ దగ్గిరే వుండి పని చేయసాగాడు. రెండ్రోజుల తర్వాత వర్కర్లు రాలేదు. ఇంక అది తమవల్ల కాదనుకున్నారో ఏమో, చినబాబుకి పట్టుదల హెచ్చింది. ఇక్కడే మిషన్ దగ్గిర గడప సాగేడు.

ఇంకో రెండ్రోజులు గడిచినయ్.

.... .... ....

"ఆ మిషన్ పాడయితే నీ కెందుకే దిగులు?" అన్నాడు పక్కింటి తాత చుట్ట నుసిని నేలకు జారుస్తూ. "నీ పేరు దానికి పెట్టినారనా?" నవ్వేడు.

సరస్వతి మాట్లాడలేదు. బియ్యంలో రాళ్ళేరుతూ కూర్చుంది.

"దేశాల్తిరిగి వచ్చిండుగా చినబాబు. చదివింది కూడా ఈ మిషన్ల మరామత్తు గురించేనట. మరి ఇంత చిన్నదాన్ని బాగుచెయ్యలేకపోతే ఎందుకా చదువు?"

ఆ మాట రాకూడదనే చినబాబు పళ్ళ బిగువున అలసట బిగపట్టి పని చేస్తున్నాడని సరస్వతికి తెలుసు. అంత క్రితం రోజు రాత్రి రెండింటి వరకూ ఫ్యాక్టరీలో లైటు వెల్గటం అది చూస్తూనే వుంది.

ఆ రోజు మధ్యాహ్నం అది ఫ్యాక్టరీకి వెళ్ళింది. కూలీలు లేకపోవడం వల్ల అంతా నిర్మానుష్యంగా వుంది. విశాలమైన వరండా వెలవెలాబోతూంది. ఆ నాల్రాజుల్లోనూ పేరుకొన్న దుమ్ము అడుగు వేసినప్పుడుల్లా పైకి లేస్తూంది.

లోపల చినబాబు ఒక్కడే పని చేస్తున్నాడు. ప్రొద్దున్నుంచీ అక్కడే పని చేస్తూన్నాడనటానికి నిదర్శనంగా అతడి చుట్టు పని ముట్లు పడి వున్నాయి. చేతులకి గ్రీజు అంటుకొని వుంది. జుట్టులోంచి చెమట ధారాపాతంగా కారుతోంది పక్కనే చిన్న ప్లాస్కు, గ్లాసూ వున్నాయి.

సరస్వతి వచ్చిన అలికిడి విని, కళ్ళెత్తి చూసి, మళ్ళీ మిషను పరీక్షించడంలో మునిగిపోయాడు. రాత్రంతా నిద్ర లేకపోవటం వల్ల, అతడి కళ్ళు ఎర్రగా, చింతనిప్పులా వున్నాయి.

చాలాసేపు మౌనంగాగడిచింది. చినబాబు ఒక్కో నట్టూబిగిస్తున్నాడు.

మరలు పని చెయ్యటం ఆగిపోయిన మనిషి, శవం అయితే, చుట్టూ చేరిన బ్రతికున్న మనుషుల్లా జాలిగా నిలబడి వున్నాయి, మిగితా మిషన్లు.

"ఏది ఆ స్విచ్ నొక్కు "అన్న మటల్తో ఉలిక్కి పడి ఈ లోకం లోకి వచ్చింది సరస్వతి. చేతులకంటిన గ్రీజు తడుచుకుంటూ నిలబడ్డాడు. 'ఇక ఇదే ఆఖరి ప్రయత్నం' అన్నట్టూ భారంగా నిశ్వసంచేడు.

సరస్వతి బాగా అలవాటున్న దానిలా మెయిన్ స్విచ్ వైపు నడిచింది. చినబాబు ఆత్రంగా చూస్తున్నాడు. కుడిచేతి చూపుడు వేలితో - ఎర్రటి స్విచ్‌ని నొక్కింది.

చిన్న చప్పుడుతో మొదలై, క్షనంలో స్పీడందుకొని చక్రాలు గిర గిరా తిరగసాగేయి. లివర్ కదలసాగింది. బేస్ ప్లేటు మీద రోలర్ కదిలింది. సరస్వతి పూర్వపు ఆరోగ్యాన్ని పుంజుకొన్న మనిషిలా చకచకా పని చేయసాగింది.

చినబాబు మొహం వెయ్యి వోల్టుల బల్బులా మెరిసిపోయింది. సరస్వతి మొహంలో చిరునవ్వు వెలిసింది.

....ఆరోజు సాయంత్రం కూలీలందరూ వచ్చేరు. పెదబాబూ ఆయన భార్యా వచ్చేరు. ఆయన భార్య పట్టుచీర కట్టుకుంది. చేతిలో వెండి వళ్ళెం వుంది. దాంట్లో కొబ్బరికాయవుంది.

హారతి వెలిగించి, దిష్టి తీసింది.

చిన్నబాబు పక్కనేవున్నాడు. మాటనిలబడినందుకు అతడి మొహంలో సంతృప్తి కొట్టొచ్చినట్టు కనబడుతూంది. అందరి మొహాల్లోనూ పెద్దరిలీఫ్.

ఆ మిషన్ బాగుపడకపోయివుంతే - బయట దేశం నుంచి మెకానిక్‌లని పిలిపించేందుకు యెంత ఖర్చయి వుండేదో. ఈ లోపులో ఎంత నష్టం వచ్చేదో. పక్కనున్న పారిశ్రామిక వేత్తకి వివరిస్తూ కొడుకువైపు గర్వంగా చూస్తూన్నాడు పెద్దబాబు.

మిషన్ 'ఫీడ్' చెయ్యటానికి పొగాకు బ్లేడుని విప్పేడు యలమంద. కట్టల మధ్య పేరుకొన్న వాసన బంధాలు తెంచుకొని గాలిలోకి వ్యాపించింది. అందరితో పాటూ ప్రేక్షకురాలిలా నిలబడి వున్న సరస్వతి ముక్కు పుటాల్లోకి వ్యాపించే.... ....

దగ్గు. గుండెలు కుదిపేసేలా దగ్గు. కిటికీలోంచి తపుక్కున బయటికి ఉమ్మేస్తే- పశ్చిమాద్రిలో కృంగిపోతున్న ఎర్రటి సూర్యుడి కిరణం - దానిమీద ప్రతిబింబించి... విశ్లేషణం చెంది....

మరింత ఎర్రగా....

ఫ్యాక్టరీ ఖర్చుతో సరస్వతిని పరీక్షించిన డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్టు పేపర్ వెయిట్ క్రింద నలుగుతోంది.

ఈ శిక్ష ఖాయం అని తెలిసిన ముద్దాయిలా సరస్వతి టేబిల్ ముందు నిలబడి వుంది.

మానేజరు కంఠం సవరించుకొని, డ్రాయర్ సొరుగు తెరుస్తూ "ఫ్యాక్టరీ ఆక్టు ప్రకారం నీకింతే వస్తుంది. అయ్యగారు మంచి మనసుతో ఇంకో వంద రూపాయలు ఎక్కువ యిమ్మన్నారు. మొత్తం ఇదిగో -" అని నోట్లు లెక్క పెట్టి యిచ్చేడు.

సరస్వతి అందుకొని, వెనుదిరిగి గదిలోంచి బయటకొచ్చింది. గది బయట యూనియన్ లీడరున్నాడు. ఆగింది.

"కాంపన్సేషన్ ఆక్టు ప్రకారం యిచ్చినప్పుడు యేమీ చెయ్యలేం. అందులోనూ టి.బీ. కదా -" సంజాయిషీ చెప్పుకుంటున్నట్టు అన్నాడు. మాట్లాడలేదు సరస్వతి. ముందుకు కదలింది.

వరండా ఖాళీగా - నిర్మానుష్యంగా మనిషి జీవితపు మెటాఫిజికల్ ఎమ్టీనెస్‌ని సూచిస్తున్న దానిలా వుంది.

పదిహేను సవత్సరాల అనుబంధాన్ని తెంచుకొంటున్న వధ్యతో కళ్ళనీళ్ళు రాలేదు. దానికన్నా విచారకరమైన స్థితి - నిర్వేదం.

మెట్లు దిగింది.

దరంగా పొలంలో మనుష్యులు, పురుగు పట్టిన ఆకుల్ని తీసి పడేస్తూన్నారు. ఎవరో సాధువు మట్టి రోడ్డు మీద తత్వం పాడుకుంటూ పోతున్నాడు.

గూర్ఖా గేటు తలుపు తీసేడు. సరస్వతి ఆగి, వెనక్కి తిరిగి చూసింది. పిచ్చి మొక్కలు వీడ్కోలు చెబుతున్నట్టు జాలిగా తలలూపు తున్నాయి. కిటికీ ఊచల మధ్యనుంచి సరస్వతి తాలూకు మరలు గిర గిరా తిరుగుతున్నాయి.

సరస్వతి ముందుకు సాగిపోయింది.

❀ ❀ ❀

**(ఆంధ్ర పత్రిక - 1982)**